

ప్రతినెలా ఆస్పత్రుల తనిఖీ

ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్య మిస్తోంది. వైద్యసేవలను పారదర్శకంగా అందజేస్తోంది. - 8లో



జలప్రసాదం ప్రారంభం

రోగులకు పరిశుద్ధమైన తాగునీరు 24 గంటల పాటు అందిస్తామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. - 8లో



అటవీమార్గంలో వైద్యుల నడక ప్రయాణం - 8లో

అర్ధరాత్రి వేళ అటవీ మార్గంలో వెళ్లారు. గిరిజన గర్భిణికి సుఖప్రసవం చేయించారు.

న్యూస్‌రీల్

'తోటపల్లి'కి తగ్గిన నీటితాకిడి



తోటపల్లి ప్రాజెక్టు

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టుకు నీటి తాకిడి తగ్గింది. నాగావళినది నుంచి ప్రాజెక్టులోకి గురువారం 13 వేల క్యూసెక్కుల నీరు చేరేది. ఇది శుక్రవారం సాయంత్రానికి 8,382 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు వద్ద 105 మీటర్లకు 103.95 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. అధికారులు రెండు గేట్‌లను ఎత్తివేసి 4,389 క్యూసెక్కుల నీటిని నదిలోకి తిరిగి విడిచిపెడుతున్నారు. పాత కుడి, ఎడమ కాలువలకు 520 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువలకు 900 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు.

ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి



జేసీ గోవిందరావు

పార్వతీపురం: ప్రభుత్వం సేకరించిన ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ తప్పనిసరని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం రవాణాచేసే వాహనాల యాజమాన్యాలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ 2023-24 సీజన్‌కు సంబంధించి జిల్లాలో కొనుగోలుచేసే ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన మిల్లులకు తరలించాలన్నారు. దీనికి సొంత వాహనాలు కలిగిన యజమానులు, లేదా రైతులు తమ వాహనాలను వినియోగించవచ్చన్నారు. వాహనాలకు యజమానులే సొంతంగా జీపీఎస్ పరికరాలను అమర్చుకోవాలని స్పష్టంచేశారు. జీపీఎస్ లేని వాహనాలకు బిల్లుల చెల్లింపు జరగదన్నారు. వాహన యజమానులు తమ వాహన వివరాలను జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయంలో సమర్పించి వాహన వివరాలను అక్టోబర్ 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న ప్రతీ రైతు భరోసా కేంద్రాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రంగా మార్పుచేసి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతు భరోసా కేంద్రం వారీగా వాహనాల వివరాలు అందించాలని ఆయన ఆదేశించారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు సిద్ధం చేశామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ జారీచేశామని, త్వరలో నియామకం పూర్తిచేస్తామన్నారు. ఎక్కడా ఎటువంటి లోపాలు తలెత్తకుండా సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా రవాణా అధికారి సి.మల్లికార్జునరెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష



నాడు-నేడు పనుల పురోగతిపై ఎంఈఓలు, హెచ్‌ఎంలతో సమీక్షిస్తున్న డీఈఓ

పాలకొండ రూరల్: 'మనబడి నాడు-నేడు' పనులను సకాలంలో పూర్తిచేయాలని డీఈఓ ప్రేమ్‌కుమార్ సూచించారు. పాలకొండ డివిజన్ పరిధిలోని ఎంఈఓలు, పాఠశాలల హెచ్‌ఎంలతో డీఈఓ శుక్రవారం సమావేశమయ్యారు. పాఠశాల అదనపు భవనాల నిర్మాణం, బిల్లుల చెల్లింపు, పాఠశాలల్లో విద్యాప్రణాళికల అమలుపై సమీక్షించారు. ఎంఈఓలు క్షేత్రస్థాయిలో నాడు-నేడు పనులను పర్యవేక్షించి సకాలంలో పూర్తిచేయించాలన్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు శ్రద్ధ చూపాలన్నారు.

ఉసురు తీసిన ఉపాధి సెంటర్

రాజాం సిటీ: ఉపాధి సెంటరే ఉసురుతీసింది. కుటుంబానికి తీరని శోకం మిగిల్చింది. సంతకవిటి మండలం ఇజ్జీపేట గ్రామానికి చెందిన చిటికం రాంబాబు(40) రాజాం-శ్రీకాకుళం రోడ్డులోని సురక్ష ఆస్పత్రి వెనుకభాగంలో వాటర్ సర్వీసింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం విధుల్లో నిమగ్నమైన వేళ విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందాడు. మృతుని భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు.

మడ్డువలసకు 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులోకి శుక్రవారం 3,500 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 64.55 మీటర్లగా ఉంది. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి ప్రాజెక్టులో వరదనీరు చేరుతోంది. ప్రాజెక్టులో చేరుతున్న నీటిని రెండుగేట్లు ఎత్తి దిగువకు విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు. ఆయకట్టు భూములకు కుడిప్రధాన కాలువద్వారా 600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు.

ప్రకృతితో సాగుదాం

సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా.. ఆరోగ్యకర ఆహారం తినకుంటే ఆస్పత్రిపాలు కావాల్సిందే అన్నది వైద్యుల మాట. రసాయనిక అవశేషాలు ఉన్న ఆహారపదార్థాల వల్లే వ్యాధులు వ్యాప్తిచెందుతున్నాయని, ప్రకృతి, సేంద్రియ పద్ధతుల్లో సాగుచేసిన పంటలను ఆహారంగా వినియోగించాలని సూచిస్తున్నారు. అందుకే.. ప్రభుత్వం ప్రకృతి, సేంద్రియ సాగును ప్రోత్సహిస్తోంది. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అవసరమైన ఆహారాన్ని ఉత్పత్తిచేసేలా రైతన్నకు ఆర్థిక ఊతం అందిస్తోంది. ఊరూరా రైతు శిబిరాలు నిర్వహించి ప్రకృతి సాగును, చీడపీడల నివారణకు అవసరమైన కషాయాల తయారీ పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరిస్తోంది. ప్రకృతిపైనే మానవ మనుగడ ఆధారపడి ఉందని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో హితబోధ చేయిస్తోంది. కిచెన్‌గార్డెన్ల నిర్వహణను ప్రోత్సహిస్తోంది.

- ప్రకృతి, సేంద్రియ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- ఈ ఏడాది జిల్లాలో 90 వేల ఎకరాల్లో చేపట్టాలన్నది లక్ష్యం
- గతేడాది 26 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు
- 26 వేల కిచెన్ గార్డెన్లు నిర్వహణ
- తగ్గుతున్న రసాయన ఎరువు వినియోగం
- పొలం గట్లపై పెరిగిన కూరగాయ పంటల సాగు



చిత్రంలో జీవామృతాన్ని తయారు చేస్తున్న మహిళా రైతు పేరు ఉషారాణి. సీతంపేట మండలం తొత్తడి గ్రామం. మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది వరి 50 సెంట్లలో సాగుచేశారు. ఎకరన్నర కొండపోడు భూమిలో జీడి, మామిడి, పుసుపు, పైనాపిల్, కంది, గోరుచిక్కుడు, బీర, చిరుధాన్యాల పంటలు వేశారు. చీడపీడల నివారణకు అవసరమైన అన్నిరకాల కషాయాలను సొంతంగా తయారు చేసుకుంటున్నారు. అన్ని పంటలు కలిపి ఏడాదికి దాదాపు రూ.2లక్షల వరకు ఆదాయం వస్తుందని ఆమె తెలిపారు. ఆరోగ్యకర పంటలు కావడంతో గిట్టుబాటు ధర లభిస్తోందన్నారు.





ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సీతంపేట:

ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగుకు పెట్టుబడి తక్కువ. లాభాలు ఎక్కువ. ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు చేతికి అందుతాయి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుంది. ప్రజారోగ్యానికి అవసరమైన ఆహార ఉత్పత్తే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే పద్ధతులను రైతుల దరికి చేర్చుతోంది. వాస్తవంగా హరిత విప్లవంతో రసాయనిక ఎరువుల వినియోగం పెరిగింది. మొదట్లో మంచి ఉత్పాదకత సాధ్యమైనా... రానురాను మోతాదుకు మించి వినియోగిస్తున్న రసాయనిక ఎరువులతో భూమి నిస్సారంగా మారింది. దిగుబడులు తగ్గడంతో పాటు ఆహార ఉత్పత్తుల్లో రసాయిన అవశేషాలు ఉన్నట్టు శాస్త్రీయంగా నిర్ధారణ అయ్యింది. ఈ పరిస్థితుల నుంచి బయట పడడానికి, రైతుకు పంట గిట్టుబాటయ్యేందుకు ప్రకృతి వ్యవసాయం ఒక్కటే సరైన మార్గమన్నది వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచన. ప్రభుత్వ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది 50 వేల మంది రైతులతో 90వేల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేయించాలని లక్ష్యం విధించారు. గత సంవత్సరం 36 వేల మంది రైతులతో 26 వేల ఎకరాల్లో సేద్యం చేశారు. దేశవాళీ ఆవుల మూత్రం, పేడ ఉపయోగించి ఘన, ద్రవ జీవామృతం తయారీ, చీడపీడలు నివారణకు అవసరమైన కషాయాల తయారీపై ఊరూరా రైతులకు ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు.

తగ్గుతున్న ఎరువు వినియోగం

సంవత్సరం	రసాయనిక ఎరువుల వినియోగం
2021-22	2లక్షల టన్నులు
2022-23	లక్షా 50వేల టన్నులు

26 వేల కిచెన్ గార్డెన్‌లు

గ్రామైక్య సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతం చేయాలనే లక్ష్యంతో రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం సెర్ప్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఇందులో భాగంగా జిల్లాలోని 361 ఆర్‌బీకే కేంద్రాలకు 175 ఆర్‌బీకేల పరిధిలో 26 వేల మంది ఎస్‌హెచ్‌జీ గ్రూపులతో 26 వేల కిచెన్‌గార్డెన్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. సెంటు నుంచి 10 సెంట్ల స్థలంలో పెరటితోటలను అభివృద్ధి చేస్తున్నారు. ఏడాది పొడవునా పంట చేతికందేలా ఐదు అంతస్తుల విధానంలో తీగజాతి కూరగాయలు, దుంపజాతి, జామ, మునగ, బొప్పాయి, అరటి, మామిడి వంటి పంటల సాగును ప్రోత్సాహిస్తున్నారు. దీనికోసం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులను ఖర్చు చేస్తున్నారు.



పార్వతీపురంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయల విక్రయం (ఫైల్)



ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగులో ఉన్న వరి

ప్రకృతి వ్యవసాయానికి ఆదరణ

ప్రకృతి వ్యవసాయానికి ఆదరణ పెరుగుతోంది. రసాయన అవశేషాలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా ప్రజలు అనేక వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగుచేసిన ఆహార ఉత్పత్తులు ఆరోగ్యదాయకం. ఈ ఏడాది అనుకున్న లక్ష్యాలు సాధించే దిశగా 'సాగు'తున్నాం.

– షణ్ముఖరాజు, డీపీఎం, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం

మంచి దిగుబడులు



ప్రకృతి వ్యవసాయంపై మన్యం రైతులు మక్కువ చూపుతున్నారు. ప్రభుత్వం కూడా సహకరిస్తోంది. ఎకరా విస్తీర్ణంలో వరి పంట సాగుచేశాను. పంట సాగుకు ముందే నవధాన్యాలతో భూమిని సారవంతం చేశాను. పంటను చీడపీడలు ఆశించకుంగా ఘన, ద్రవ జీవామృతాలను పిచికారీ చేస్తున్నాం. పత్తిపంటలో అంతర పంటలు సాగుచేస్తున్నాను. ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువ.

– జగన్‌మోహన్‌రావు, దారిమల్లి, రైతు



పొలం గట్లపై కూరగాయల మొక్కల పెంపకం

సామాజిక భద్రత కల్పించేలా రుణ ప్రక్రియ

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- సీఎస్‌ఆర్ కింద రూ.1.97 లక్షల చెక్కును అందజేసిన కెనరా బ్యాంకు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రైతులు, చిరు వ్యాపారులు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకులకు చేదోడుగా ఉంటూ సామాజిక భద్రత కల్పించేలా రుణ మంజూరు ప్రక్రియ ఉండాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ఆ దిశగా బ్యాంకర్లు కృషి చేయాలని, రుణ ప్రక్రియను సులభతర రీతిలో నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ప్రమాణాలకు అనుగుణంగా పరిశీలించాలని, తిరస్కరణకు కాకుండా రుణ మంజూరుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా త్రైమాసిక బ్యాంకర్ల సమావేశం శుక్రవారం జరిగింది. రుణ మంజూరు ప్రక్రియ, సామాజిక భద్రత పథకాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, పరిశ్రమల స్థాపనకు బ్యాంకర్ల తోడ్పాటు, ముద్రా, పీఎంజీవై తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో భాగంగా గత త్రైమాసికంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు ప్రక్రియ గురించి ఎల్.డి.ఎం శ్రీనివాసరావు వివరించారు. రుణ మంజూరు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణమంజూరు తిరస్కరణ దరఖాస్తుల నివేదికను అందజేయాలని బ్యాంకర్లను కోరారు. సీసీఆర్‌సీ కార్డులున్న కౌలు రైతులకు ప్రోత్సాహకర రీతిలో రుణాలు మంజూరు చేయాలని సూచించారు. రుణాలు ఇప్పించే బాధ్యతను వ్యవసాయ శాఖ తీసుకోవాలని స్పష్టం చేశారు. జగనన్న తోడు, స్త్రీనిధి పథకం కింద వచ్చే వారికి రుణాలు అందించాలని సూచించారు. ఇటీవల రాజాంలో జరిగిన సంఘటనను పరిగణనలోకి తీసుకొని స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెందిన నగదును వారి ఖాతాల్లో మాత్రమే జమ చేయాలని, టీం లీడర్ ఖాతాలో జమ చేయవద్దని పేర్కొన్నారు. రైతులు, చిరు వ్యాపారులకు బ్యాంకర్లు చేదోడుగా ఉంటూ వారికి ఆర్థిక పరమైన విషయాల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

స్త్రీనిధి రుణ లక్ష్యం రూ.157 కోట్లు

- ఏజీఎం ఉమామహేశ్వరరావు

రేగిడి: జిల్లాలోని డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు స్త్రీ నిధి కింద రూ.157 కోట్లు రుణాలు మంజూరుచేయాలన్నది లక్ష్యమని డీఆర్‌డీఏ ఏజీఎం ఎ.ఉమామహేశ్వరరావు తెలిపారు. రేగిడిలో స్త్రీ నిధి రుణాలు పేటీఎంల ద్వారా మహిళలకు చెల్లించే విధానాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 11,268 మంది మహిళలకు రూ.76.49 కోట్ల మేర రుణాలు మంజూరు చేశామన్నారు. స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను పేటీఎంలు ద్వారా చెల్లింపులు చేయవచ్చన్నారు. రానున్న రోజుల్లో ప్రతి వీఓఏకు ఒక పేటీఎమ్ మిషన్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాజాం క్లస్టర్ మేనేజర్ సుధాకర్‌రావు, వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ చిరంజీవి, ఏపీఎం మంగమ్మ, సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

సహస్ర దీపాలంకరణ



దీపాలంకరణ సేవ జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శుక్రవారం సహస్ర దీపాలంకరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. స్వామికి ప్రాతః కాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. అనంతరం వెండి మంటపం వద్ద నిత్యకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం దీపారాధన మండపం వద్ద ఏర్పాటు చేసిన ఊయలలో స్వామిని ఆసీనులు చేసి ఊంజల్ సేవ జరిపించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ నిబంధన మార్చేశారు..!

- ఏడాదిగా రెట్టింపు జీతం చెల్లింపు
- అవుట్ సోర్సింగ్‌కు బదులు కాంట్రాక్టు ఉద్యోగిగా నియామకం
- తక్షణమే దాన్ని సరిచేయాలని డీసీహెచ్‌ఎస్‌కు కమిషనర్ ఆదేశాలు

విజయనగరం ఫోర్ట్: వైద్య విధాన్ పరిషత్‌లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీచేయాల్సిన ఫిజియోథెరపిస్ట్ పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేశారు. దీనివల్ల రూ.21వేల జీతానికి బదులు రూ.48వేలు చొప్పున ప్రతినెలా చెల్లిస్తున్నారు. ఏడాది కాలంగా సాగుతున్న ఈ వ్యవహారాన్ని స్టేట్ ఫైనాన్స్ విభాగం అధికారులు గుర్తించి ఏపీవీపీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే దీనిని సరి చేయాలంటూ డీసీహెచ్‌ఎస్‌కు ఆదేశాలు జారీ చేశారు.

ఇదే విషయాన్ని డీసీహెచ్‌ఎస్ బి.గౌరీశంకర్ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా ఫిజియో థెరపిస్టు పోస్టును మిగతా జిల్లాల్లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీచేసి జీతం చెల్లిస్తుంటే... ఇక్కడ కాంట్రాక్టు పద్ధతి ప్రాతిపదికన జీతం ఎందుకు చెల్లిస్తున్నారంటూ కమిషనర్ ప్రశ్నించారని, దీనిని సరిచేయాలని సూచించారన్నారు. ఆ నియామకం తన హయాంలో జరగలేదన్నారు. నియామక ఫైల్‌ను విజయవాడ కమిషనరేట్‌కు పంపించామని, అక్కడ నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటి ముంగిటకే వైద్యం

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తింపు
- పెన్షన్‌దారుల ఆధార్ టెక్నికల్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాట్లు
- గ్రామ వలంటీర్ల ఖాళీలు ఎప్పటికప్పుడు భర్తీ
- అభివృద్ధిపనులపై ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ అవసరం
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్:

ప్రతి గడపకు వైద్యం చేరువ చేసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపై వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారన్నారు. వైద్యశిబిరాలో 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ నెల 30 నుంచి నవంబర్ 9 వరకు ఉమ్మడి జిల్లాల పరిధిలో 500 వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 25న విజయనగరం జిల్లా మెంటాడ మండలం పిట్టాడ గ్రామం, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వినాయకనగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష పైలెట్ క్యాంప్ నిర్వహిస్తామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి భాస్కరరావు తెలిపారు.

బిల్లులు అప్‌లోడ్ చేయాలి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో చేపట్టిన ప్రభుత్వ భవన నిర్మాణాల బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు జెడ్పీ చైర్మన్ సూచించారు. నిధులు సమృద్ధిగా ఉన్నాయని, బిల్లులు అప్‌లోడ్ చేస్తే వెంటనే చెల్లింపులు జరుగుతాయన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం, ఎన్‌ఆర్‌ఈజీఎస్, జెడ్పీ నిధులతో చేపడుతున్న పనుల బిల్లులన్నీ ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. పని ఎక్కువగా ఉంటే ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సహకారం తీసుకోవాలన్నారు. పనుల వేగవంతానికి ఎస్‌ఈ నుంచి ఏఈల వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల భవన నిర్మాణాలకు సమరించిన పేమెంట్‌కు ఎటువంటి క్వాలిటీ చెక్ అవసరం లేదని అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో అన్నిచోట్ల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పనుల వేగవంతానికి కృషి చేయాలన్నారు.

అర్హత ఉన్న అవ్వాతాతలకు పింఛన్లు

అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన ఉద్దేశమని జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు. అర్హత ఉండి ఆధార్‌లో తక్కువ వయస్సు నమోదై ఉన్న వృద్ధులకు పింఛన్ అందించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. స్పందనలో వారి దరఖాస్తులను డీఆర్‌డీఏ పీడీ లాగిన్‌కు పంపిస్తే అక్కడ నుంచి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారికి పంపించాలని, దీనికోసం ప్రత్యేకంగా మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి, వయస్సు నిర్ధారిస్తూ ధ్రువపత్రం మంజూరు చేస్తుందన్నారు. దీనిపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని ఎంపీడీఓలకు సూచించారు.



సమావేశానికి హాజరైన అధికారులు

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ఉమ్మడి జిల్లాల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ చైర్మన్ పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రతి వారం 2 నుంచి 3 గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పనులు చేపట్టాలని పంచాయతీ విస్తరణాధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో చేపడుతున్న పనులు పూర్తి చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లా పరిధిలో గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీచేసి నియామకాలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్‌కు సూచించారు. ఇక నుంచి ప్రతినెలా సమీక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ గుప్త, ఉమ్మడి జిల్లాల డీపీఓలు, డ్వామా పీడీలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విజయనగరం: రాష్ట్రస్థాయి కరాటేపోటీల్లో విజయనగరం పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులకు పతకాలు లభించాయి. ఈ మేరకు పట్టణానికి చెందిన కరాటే కోచ్ కానూరు సంతోష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ సిటీలోని గాజువాక బీసీ రోడ్డులో ఉన్న అగ్నికుల క్షత్రియ కల్యాణ మంటపంలో గురువారం జరిగిన 15వ రాష్ట్రస్థాయి కెన్యూర్యూ చాంపియన్ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులకు పలు విభాగాలలో పతకాలు లభించినట్లు ఆయన పేర్కొన్నారు. బి.శివ, శ్రీ హర్ష సిల్వర్ పతకాలు సాధించగా ఎస్.కార్తీక్, బి.షణ్ముఖ శ్రీకర్, ఎస్.జితేంద్ర, ఎస్.శ్రీకాంత్, జి.వంశీలకు కాంస్య పతకాలు, పి.హేమంత్ వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. పతకాలు సాధించిన విద్యార్థులను గురుదత్త పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మ పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

మాజీ ఎంపీపీపై కేసు నమోదు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మాజీ ఎంపీపీ పైల సింహాచలంపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు గరివిడి ఏఎస్సై రమణ తెలిపారు.ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి మాజీ ఎంపీపీ, కాపుశంభాం గ్రామానికి చెందిన పైల సింహాచలం, పైల జనతో పాటు మరికొంత మంది గ్రామంలో తలెత్తిన భూవివాదంలో తనపై దాడి చేసి, కులం పేరుతో దూషించారని అదే గ్రామానికి చెందిన ఎస్సీ మహిళ గెడ్డపు శ్రీదేవి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

అటవీమార్గంలో వైద్యుల నడక ప్రయాణం

- అర్ధరాత్రి వెళ్లి గర్భిణికి వైద్య సేవలు


పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న తల్లీబిడ్డ

పాచిపెంట: అర్ధరాత్రి వేళ అటవీ మార్గంలో సుమారు రెండు కిలోమీటర్లు వైద్యులు నడిచి వెళ్లి గిరిజన గర్భిణికి సుఖప్రసవం చేయించారు. పాచిపెంట మండలంలోని కర్రివలస పంచాయతీ మూలవలసలో గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గర్భిణి కొర్ర మిత్ర(22) ఈనెల 16వ తేదీన స్థానిక ఆశ వర్కర్ సహాయంతో పాచిపెంట పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంది. అనంతరం వైద్యుల సూచన మేరకు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె ఎవరికీ చెప్పకుండా స్వగ్రామానికి వచ్చేసింది. గురువారం రాత్రి 9 గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు గ్రామంలో ఉన్న ఆశ వర్కర్‌ను సంప్రదించారు. వెంటనే ఆశ వర్కర్ పాచిపెంట పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటరమణకు తెలియజేసింది. దీంతో ఆయన వైద్యసిబ్బందితో కలిసి సుమారు రెండు కిలోమీటర్ల దూరం గ్రామానికి నడిచి వెళ్లి గర్భిణికి సుఖ ప్రసవం చేయించారు. అనంతరం స్థానికుల సహాయంతో తల్లీబిడ్డలను తీసుకువచ్చి ఆటోలో పాచిపెంట పీహెచ్‌సీకి తరలించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు.

క్లాప్ డ్రైవర్ల నిరసన


కార్యక్రమంలో మాట్లాడుతున్న జగన్‌మోహనరావు

విజయనగరం పూల్‌బాగ్: మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ. జగన్‌మోహనరావు అన్నారు. శుక్రవారం స్థానిక రాజీవ్‌గాంధీ స్టేడియం వద్ద క్లాప్ వాహన డ్రైవర్లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ విజయవాడ అలంకార్ ధర్నా చౌక్ వద్ద ఈ నెల 21 నుంచి జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు సంఘీభావంగా విజయనగరం కార్పొరేషన్ కార్మికులు సెప్టెంబర్ 22 నుంచి 25 వరకు నిరసన బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు. అలాగే 25న కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్పొరేషన్ కార్యదర్శి బి. భాస్కరరావు, నాయకులు రామచంద్రరావు, కృష్ణ, రామారావు, రాఘవ, కుమారి, రమా, లక్ష్మణరావు, సూరి, చిన్ని, పైడిరాజు పాల్గొన్నారు.

జీపీఎస్‌పై పునరాలోచించాలి

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ స్కీమ్ స్థానంలో అమలు చేస్తున్న జీపీఎస్‌పై పునరాలోచన చేయాలని పీఆర్‌టీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రనాయుడు, డి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుకుంటున్న పాత పెన్షన్ స్కీమ్‌నే అమలు చేయాలని కోరార

ప్రతి నెలా ఆస్పత్రుల తనిఖీ

- ప్రైవేట్ ఆస్పత్రులకు జవాబుదారీ తనం తప్పనిసరి
- డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించకుంటే చర్యలు
- ఆరోగ్య శ్రీ రోగులకు ఉచితంగా సేవలు


పార్వతీపురంలోని ప్రైవేట్ ల్యాబ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పార్వతీపురంటౌన్: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. వైద్యసేవలు పారదర్శకంగా అందజేయాలని, ప్రతి సేవకు జవాబుదారీ తనం ఉండాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచిస్తోంది. ఇందులో భాగంగా ఆస్పత్రుల తనిఖీలను తప్పనిసరి చేసింది. ఈ మేరకు ప్రతినెలా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీకి ప్రత్యేక బృందాలను నియమించింది. నోటిఫైడ్ వ్యాధుల వివరాలు, సేవల తీరును విధిగా నమోదు చేయాలని ఆదేశాలు జారీచేసింది. వైద్యసేవలు అందజేయడంలో నిర్లక్ష్యం వహించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, ఆస్పత్రి సేవల వివరాలు సరిగా నమోదు చేయకపోయినా ఆస్పత్రుల లైసెన్సు రద్దు చేయాలని జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులకు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సూచించారు. దీంతో పార్వతీపురం మన్యం జిల్లాలో ఆస్పత్రుల తనిఖీలను వైద్యారోగ్యశాఖ అధికారులు ముమ్మరం చేశారు. ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు, ఆస్పత్రులు, క్లినిక్‌ల సేవలపై నిఘా పెంచారు. సెప్టెంబర్ నెలలో జిల్లాలోని 28 ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లను తనిఖీచేసి 8 ఆస్పత్రులపై కేసులు నమోదు చేశారు.

నెలలో ఆరు ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ

డీఎంహెచ్ ప్రతి నెలా జిల్లాలోని ఆరు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేయాలి. తనిఖీ చేసిన ఆస్పత్రుల నివేదికను కుటుంబ సంక్షేమశాఖ పోర్టల్‌కు అనుసంధానించాలి. డీఎంహెచ్‌ఓతో పాటు మరో బృందం కూడా ఉంటుంది. ఈ బృందాలు తరచూ తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి. ప్రైవేట్ వ్యక్తుల నుంచి నర్సింగ్ హోమ్ మీద వచ్చిన ఫిర్యాదులకు తక్షణమే స్పందించి పరిష్కరించాలి. డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకోని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రైవేట్ ఆస్పత్రులపై వస్తున్న ఫిర్యాదులివే..

- నోటిఫైడ్ డిసీజ్ వివరాలు పోర్టల్‌లో నమోదు చేయకపోవడం
- ఇష్టారాజ్యం లింగనిర్ధారణ పరీక్షలు
- జనన ధ్రువీకరణ వివరాలు నమోదు చేయకపోవడం
- సరైన కారణాలు లేకుండానే అబార్షన్లు నిర్వహించడం
- డెంగీ చికిత్సకు భారీగా డబ్బులు వసూలు చేయడం
- ఆరోగ్యశ్రీ సేవలకు రోగుల నుంచి డబ్బు వసూలు చేయడం
- కాన్పు సమయంలో తల్లుల మృతి పట్ల సరైన కారణాలు చూపకపోవడం

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల వివరాలు	
క్లినిక్‌లు	38
డెంటల్ క్లినిక్‌లు	15
పాలిక్లినిక్‌లు	03
బేసిక్ ల్యాబ్‌లు	17
హై అండ్ ల్యాబ్	1
20పడకల ఆస్పత్రులు	24
21-50 పడకల ఆస్పత్రులు	2
51-100పడకల ఆస్పత్రులు	2
తనిఖీచేసిన ప్రైవేట్ ఆస్పత్రులు	28
నమోదు చేసిన కేసులు	8

నిర్ధారణ అయితేనే డెంగీగా పరిగణించాలి

డెంగీ వ్యాధి నోటిఫైడ్ డిసీజ్. ఈ వ్యాధి సోకినప్పుడు ప్రైవేట్ ఆస్పత్రులు తప్పకుండా ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలి. అలా చేయకుండా ఏ జ్వరమైనా డెంగీగా చిత్రీకరించి, ప్లేట్‌లెట్లు తగ్గాయని వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి వైరల్ ఫీవర్‌కు కూడా ప్లేట్‌లెట్లు తగ్గడం సహజం. ప్రైవేట్ ఆస్పత్రుల్లో దీనిపై దోపిడీ జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఇకపై ఇలా చేసిన ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. దీనిపై తనిఖీ బృందం ప్రత్యేక దర్యాప్తు నిర్వహిస్తోంది.

రిజిస్ట్రేషన్ రద్దు చేస్తాం



ప్రాణాంతక మలేరియా, డెంగీ, టీబీ, మ్యూకోమైకోసిస్, హ్యూమన్ రేబిస్, టైఫాయిడ్ వివరాలు ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, అబార్షన్, డెలివరీలు, ఆపరేషన్ వివరాలను హెల్త్ మెడికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో నమోదు విషయమై ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్‌ను తనిఖీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. వివరాల నమోదులో నిర్లక్ష్యం చేస్తే షోకాజ్ నోటీసులు జారీ చేసి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తాం.

– డా.బి.జగన్నాథరావు, డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం

జలప్రసాదం ప్రారంభం


ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

- సర్వజన ఆస్పత్రిలో ఆర్వో ప్లాంట్
- రోగులకు పరిశుద్ధమైన తాగునీరు

విజయనగరం ఫోర్ట్: రోగులకు పరిశుద్ధమైన తాగునీరు 24 గంటల పాటు అందిస్తామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జిల్లా పరిషత్ నిధులు రూ.10.50 లక్షలతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులు, సహాయకులు, విధులు నిర్వహించే వైద్యులు, సేవలు అందించే సిబ్బంది సౌకర్యార్థం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన దీనికి జలప్రసాదం అని నామకరణం చేసినట్లు చెప్పారు. వెయ్యిలీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులను ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే కూలింగ్ వాటర్ కోసం ప్రత్యేకంగా మరో 80 లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకును ఏర్పాటు చేశామని చెప్పారు. ప్లాంట్ నుంచి పగలు, రాత్రి కూడా తాగునీరు వస్తుందన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, సహాయకులు వినియోగించుకోవాలని కోరారు. ప్లాంట్ నిర్వహణ కోసం మరో రూ.2.50 లక్షలు అవసరమవుతాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ప్రస్తావించగా ప్రతిపాదనలు తయారుచేయాలని జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్‌కు సూచించారు. ఆస్పత్రిలో అన్ని రకాల వసతులు సమకూర్చుతామని, క్యాంటీన్ ఒకటి మిగిలిపోయిందని, త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, డిప్యూటీ సూపరింటెండెంట్‌లు బొత్స సంతోష్, పీఏ రమణ, ఆర్‌ఎంఓ డాక్టర్ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఉమాశంకర్, నగర్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


మృతురాలు దేవి (ఫైల్)

మెంటాడ: మండలంలోని కొండలింగాలవలస పంచాయతీ పరిధి చల్లవానివలస గ్రామానికి చెందిన ఉయ్యాల.దేవి(35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం ఆమెకు కడుపునొప్పిరావడంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించినప్పటికీ తగ్గకపోవడంతో మధ్యాహ్నం 12 గంటల తరువాత చల్లపేట ఆస్పత్రికి తీసుకువెళ్లారు.చల్లపేటలో ప్రాథమిక చికిత్స అనంతరం గజపతినగరం సీహెచ్‌ఎన్‌సీకి మెరుగైన చికిత్సకోసం చల్లపేట వైద్యులు సూచనల మేరకు తరలించడంతో మార్గమధ్యంలోనే మరణించినట్లు సీహెచ్‌ఎన్‌సీ వైద్యులు ధ్రువీకరించారు. అయితే మృతదేహాన్ని ఇవ్వమని వైద్యులను బంధువులు కోరగా మృతదేహంపై గాయాలు ఉండడంతో వైద్యులకు అనుమానం వచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేశారు. వైద్యుల ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆస్పత్రికి వచ్చి మృతురాలి తల్లి ఎరకమ్మతో మాట్లాడి కుమార్తె మృతిపట్ల అనుమానాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. అల్లుడు,కూతురు లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని సారాడవలసలో తనవద్దనే ఉంటున్నారని, రెండు రోజుల క్రితం అత్తవారిల్లు చల్లవానివలస వెళ్లారని, ఇంతలోనే ఈఘోరాన్ని చూడాల్సి వస్తుందనుకోలేదని కన్నీటిపర్యంతమైంది. మృతురాలి తల్లి ఎరకమ్మ ఫిర్యాదు మేరకు ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచాలి

- కలెక్టర్ నాగలక్ష్మి
- నెల్లిమర్లలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం


నెల్లిమర్లలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నెల్లిమర్ల: 'జగనన్నకు చెబుదాం' ప్రజా వినతుల పరిష్కారం కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరించే చర్యల్లో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లిమర్ల మండల కేంద్రంలో కార్యక్రమం జరిగింది. మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని వివిధ వర్గాల ప్రజల నుంచి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, తహసీల్దార్ ధర్మరాజు, ఎంపీడీఓ రామారావు, మండల ప్రత్యేకాధికారి 86 వినతులు స్వీకరించారు. మండల స్థాయి వినతుల స్వీకార కార్యక్రమంలో రెవెన్యూశాఖకు సంబంధించి 26, గృహనిర్మాణ శాఖ 16, వైద్య ఆరోగ్య శాఖ 4, పంచాయతీరాజ్ 3, డీఆర్‌డీఏ 10, పంచాయతీరాజ్ 14, ఆర్‌డబ్ల్యూఎస్ 5, మిగిలినవి ఇతర శాఖలకు చెందిన వినతులు అందాయి. అర్జీల స్వీకరణ అనంతరం అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కాలేరని భావించి మండలాల్లో కూడా జగనన్నకు చెబుదాం వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా అధికారులంతా ఈ కార్యక్రమంలో స్వీకరించిన ప్రజావినతులను అర్జీదారుల్లో పెంచే దిశగా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన లేకపోవడం వల్ల కొన్ని ఫిర్యాదులు వస్తున్నాయని, ముందుగా పథకాలపై ఆయా శాఖలు సమగ్రంగా వివరించి అవగాహన కలిగించాలని సూచించారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు

నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు కలెక్టర్‌ను కలిసి తొలిసారిగా మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నెల్లిమర్ల–జరజాపు పేట నగర పంచాయతీగా పేరు మార్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జరజాపుపేట రైతు భరోసా కేంద్రానికి, శాఖా గ్రంథాలయానికి పక్కా భవనాల నిర్మాణానికి స్థలం, నిధులు మంజూరు చేయాలని వినతులను సమర్పించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే తనిఖీ

జేకేసి అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి గాంధీనగర్‌లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే బృందంతో మాట్లాడి సర్వే చేస్తున్న తీరుపై ప్రశ్నించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు సమీర, ఎంపీడీఓ, తహసీల్దార్, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹136	₹242	₹ 252

ఆన్‌లైన్‌లో 'రక్తచరిత్ర'

- రక్తకోస్ వెబ్‌సైట్‌లో వివరాలు
- బ్లడ్ బ్యాంకుల బయట బోర్డుల ఏర్పాటు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన రక్త నిల్వల బోర్డు

విజయనగరం ఫోర్ట్: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకతకు పెద్ద పీట వేస్తోంది. ఈ మేరకు అన్ని శాఖల్లోనూ సేవల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పారదర్శకత పెరిగింది. ఈ నేపథ్యంలో రక్తనిధి కేంద్రాలు (బ్లడ్‌బ్యాంక్)ల వివరాలను కూడా ప్రభుత్వం వెబ్‌సైట్‌లో పెట్టింది.

వెబ్‌సైట్‌లో వివరాలు

జిల్లాలో 9 బ్లడ్‌బ్యాంక్‌లు ఉన్నాయి. ఆయా బ్లడ్ బ్యాంకుల్లో గల రక్త నిల్వలు వివరాలు రక్తకోస్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఏ రక్త నిధి కేంద్రంలో ఏ గ్రూపు రక్తం ఎన్ని యూనిట్లు ఉందో వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. బ్లడ్ బ్యాంక్‌కు నేరుగా వెళ్లి తెలుసుకునే కంటే వెబ్‌సైట్‌లో సులువుగా తెలుసుకోవచ్చు దీనివల్ల సమయం, శ్రమ ఆదా అవుతాయి.

జిల్లాలోని బ్లడ్‌బ్యాంకులు

జిల్లాలో మిమ్స్ బ్లడ్ బ్యాంక్(నెల్లిమర్ల), ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్(విజయనగరం), రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ (విజయనగరం), ఎస్‌బీఎస్ బ్లడ్ బ్యాంక్ (విజయనగరం), న్యూలైఫ్ బ్లడ్ బ్యాంక్(విజయనగరం), విజయ బ్లడ్‌బ్యాంక్(విజయనగరం), రోటరీ బ్లడ్ బ్యాంక్ (విజయనగరం) బొబ్బిలిలో బ్లడ్ బ్యాంక్‌లు ఉన్నాయి.

బ్లడ్‌బ్యాంక్ బయట వివరాలు

జిల్లాలో ఉన్న ప్రతి బ్లడ్ బ్యాంక్ బయట సంబంధిత బ్లడ్ బ్యాంక్‌లోని రక్త నిల్వల వివరాలు బోర్డులో పొందుపరిచారు. ప్రతి రోజు వాటి వివరాలు మార్చుతూ ఉంటారు.

ఏడాదికి 9 వేల యూనిట్స్ రక్త సేకరణ

జిల్లాలో ఉన్న తొమ్మిది బ్లడ్ బ్యాంక్‌లు రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరిస్తాయి. అలాగే కొంతమంది బ్లడ్‌బ్యాంక్‌లకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేస్తారు. ఏడాదికి జిల్లాలోని బ్లడ్ బ్యాంక్‌ల ద్వారా 9 వేల యూనిట్ల వరకు రక్తం సేకరిస్తారు.

నిల్వల వివరాలు తెలుస్తాయి

రక్తకోస్ వెబ్‌సైట్‌లో బ్లడ్ వివరాలు తెలుసుకో వచ్చు. ఏ బ్లడ్ బ్యాంక్‌లో ఏఏ గ్రూపులు ఎంత ని ల్వ ఉన్నాయనేది రక్తకోస్ వెబ్‌సైట్‌లో తెలుసుకో వచ్చు. బ్లడ్ బ్యాంక్‌ల బయట కూడా రక్త నిల్వల వివరాలు ప్రతిరోజూ ఏర్పాటు చేస్తున్నాం.

డాక్టర్ సునీల్ కుమార్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి

పండగపై ప్రచారం చేయాలి


ప్రచారరథాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ కేఎల్ సుధారాణి, ట్రస్ట్ బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: సిరులతల్లి పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు అక్టోబర్ 4వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో పైడితల్లి దీక్షలతో పాటు ప్రధాన ఘట్టమైన తొలేళ్ల ఉత్సవం, సిరిమానోత్సవం, తెప్పోత్సవం, ఉయ్యాల కంబాల ఉత్సవాల విశిష్టతలను వివరిస్తూ ఊరూరా ప్రచారం చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రచారరథాన్ని ఆలయ ఈఓ కేఎల్ సుధారాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పైడితల్లి దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో భక్తులు, దీక్షాపరులతో ఉత్తరాంధ్ర అంతటా ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ వేదపండితులు, దాతలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వే స్టేషన్ వద్దనున్న బైక్ పార్కింగ్ వెనుక ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో గంజాయి అమ్మకాలు చేస్తున్న కణపాక మహంతి వీధికి చెందిన మహంతి శ్రీధర్ అలియాస్ ఉదయ్‌ను అదుపులోకి తీసుకుని ఐదుకిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శుక్రవారం వివరాలు వెల్లడించారు. బరంపురం నుంచి రాత్రివేళ విజయనగరానికి నిందితుడు గంజాయి తీసుకువచ్చి, చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి మత్తుకు బానిసైన వారికి ఎక్కువ మొత్తానికి విక్రయిస్తున్నాడన్న పక్కా సమాచారంతో నిఘా పెట్టామన్నారు. నిఘాలో పట్టుబడిన నిందితుడిని అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో హ్యాకథాన్ పోటీలు ప్రారంభం


విద్యార్థులతో మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో హ్యాకథాన్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీకే మహంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఏకధాటిగా 72 గంటల పాటు కొనసాగనున్న హ్యాకథాన్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటాలని పిలుపునిచ్చారు. 51 అంశాలకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపేందుకు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. బ్లాక్‌చైన్ అండ్ సైబర్ సెక్యూరిటీ, స్మార్ట్ ఎడ్యుకేషన్, ఆటోమేషన్, అగ్రిటెక్, రోబోటిక్స్, డ్రోన్స్ అంశాలకు సంబంధించి హ్యాకథాన్ పోటీలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్ డాక్టర్ సన్నీడియోల్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్‌ఎస్ వర్మ, డీన్‌లు రమణారావు, మురళి పాల్గొన్నారు.


పోటీలకు హాజరైన విద్యార్థులు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ ONE SITTING 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, MCA, Nursing Pharmacy, Dip. In VET. B.Tech., from Recog., Universities in India. (for Discontinued) Exams in October/November ✆ : 73383 76874 [R-103]

PLOT FOR SALE
■ విజయనగరం లెండి ఇంజనీరింగ్ కాలేజీ ఆపోజిట్ 4 లైన్ హైవేకి 1, 1/2 కి.మీ. 50 ఎకరాలు గేటెడ్ VMRDA లే అవుట్ 24 నెలలు EMI. మరియు ఆనందపురం జంక్షన్ నుండి టోల్‌గేట్‌కి 2 కి.మీ. 6 లైన్స్ హైవే ఫేసింగ్ 100 మీటర్లు 80 ఎకరాల గేటెడ్ VMRDA లే అవుట్ రెసిడెన్సియల్ ప్లాట్స్ డిమాండ్ ప్రాజెక్ట్. ఫోన్: 96421 43414 [V-2141]
■ Near Bhogapuram 400 Sq.Yards East Facing, VUDA Approved Plots For Sale. Ph : 90101 97197 [V-2146]
■ బైక్ ఫ్రీ : VZM - రాయపూర్ రోడ్, 5th బెటాలియన్ ఎదురుగా, హైవేకి 2 మినిట్స్. రెడీ టు కన్‌స్ట్రక్షన్ VMRDA ప్లాటు కొనుగోలుపై రూ॥ 80,000/- విలువైన E- బైక్ ఫ్రీ. భోగాపురం, ఆనందపురంలలో ప్లాట్లు కలవు. ఫోన్ : 73308 11149 [V-2850]

HOUSE FOR SALE
■ సాయి గోల్డెన్ వెంచర్స్ వారి వినాయక చవితి శుభాకాంక్షలు. విజయనగరం లోకల్‌లో ఇండిపెండెంట్ 2 BHK ఇల్లు కేవలం 35 లక్షలు మాత్రమే. Call: 9391873337 [S-1191145]

SITE FOR SALE
■ విజయనగరం, భోగాపురం, కందివలస జంక్షన్ హైవే దగ్గరలో VMRDA ప్లాట్లు కలవు. అతి తక్కువ ధరలలో లభించును. ఫోన్ : 98857 88083 [V-2137]

COMMERCIAL SALE
■ Commercial Property for Sale Land Building 1428 Sq.yds 24500 Builtup Area at Saidabad,Hyd. Rent getting 5 Lakhs. Ph: 9849090098 [HA-346]

WANTED
■ Wanted teachers to teach Telugu, English and Hindi for primary classes. Sri Saraswati vidhya niketan Dharmapuri, vzm. ph.9492620207 [S-1220338]
■ బొబ్బిలి మన గ్రోమోర్‌లో పని చేయుటకు ఫీల్డ్ సిబ్బంది కావలెను. Qly: ఇంటర్, ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్: 9701602206, 9959022110 [S-1220386]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221708]
■ వైజాగ్‌లో ఫుడ్, రూమ్ సదుపాయంతో మా షాపింగ్ మాల్ గోడౌన్స్ (Ware House) నందు పనిచేయుటకు 19-35 వయస్సు గల యువకులు కావలెను. నెల జీతం : 10,000/-. ఫోన్ : 97046 37370, 97051 94330 [V-26453]
■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221639]
■ రామకృష్ణ గ్రూపు, VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధుల సేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15 to 22 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 8639756219, 8639756226 [B-1068118]
■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం: 18K. హైదరాబాద్: 9640258899, విజయవాడ: 9640648899 [HA-631]
■ మీ దగ్గర స్మార్ట్ ఫోన్ ఉంటే నిజాయితీగా మీ చోటనుండే వర్క్ చేస్తూ మా సపోర్ట్‌తో నెలకు అధిక ఆదాయం సంపాదించవచ్చు. ఇంటర్ పైన చదివి, 20-35 సం॥వారు, ఏలాంటి ఫీజు లేదు. ఫోన్: 75697 63852 [V-797413]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.